క్లుప్తంగా

డిగ్రీ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం

కంభం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 వ సంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (హిస్టరీ), బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ (గణితం), బీఎస్సీ (జువాలజీ) గ్రూపు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తర్లుపాడు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కొమరోలు మీదుగా హైదరాబాద్‌కు కొత్త సర్వీస్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపో నుంచి కొమరోలు మీదుగా హైదరాబాద్‌కు కొత్త సర్వీసును నడపనున్నట్లు డిపో అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు గిద్దలూరు నుంచి పాదలకుంట పల్లె, రాజుపాలెం, ఎడమకల్లు మీదుగా కొమరోలుకు చేరుకుని అక్కడ నుంచి ప్రతి రోజు రాత్రి గం.8.45 కు బయలుదేరి తాటిచెర్ల మోటు, బేస్తవారిపేట, కుంటల మీదుగా హైదరాబాద్‌కు వెళ్లనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని కొమరోలు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నలమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేటి నుంచి 15 రోజుల్లోపు దేవస్థానం కార్యనిర్వహణాధికారికి దరఖాస్తులు ఇవ్వాలని ఆయన కోరారు.

చెన్నకేశవ స్వామి ఆలయానికి కూడా..

మార్కాపురం టౌన్: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న హిందూ అభ్యర్థులు 20 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇందుకు సంబంధించి దేవదాయ శాఖ అధికారులు ఈ నెల 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ఫసల్ బీమా దరఖాస్తు గడువు పెంపు

అర్ధవీడు: ప్రధానమంత్రి ఫసల్ బీమాకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి జీ.శివ గంగాప్రసాద్ తెలిపారు. మండలలోని నారాయణపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మీ సేవా కేంద్రాల్లో పంటలు సాగు చేసిన రైతులు ఇన్సూరెన్సు చేయించుకోవాలన్నారు. విత్తనోత్పత్తిలో మొక్కజొన్న పంట సాగుచేసే రైతులు కంపెనీ ప్రతినిధుల నుంచి అగ్రిమెంటు తీసుకొని సాగు చేయాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు–పురుగు మందుల దుఖాణాల్లో రసీదు తీసుకొని కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

పీఏసీఎస్‌లకు కొత్త చైర్మన్‌లు

పొదిలి రూరల్: పొదిలి మండలంలో రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (పీఏసీఎస్) ప్రభుత్వం చైర్మన్‌లను నియమించింది. ఉప్పలపాడు రామలింగేశ్వర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా ఉలవా వెంకట గోపి,స భ్యులుగా వి. రమణారెడ్డి, వంకాయలపాటి మోహన్‌రావులను నియమించారు. మాదాలవారిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి చైర్మన్‌గా నియమించారు. సభ్యులుగా బత్తిన ఓబయ్య, పుట్టా వెంకటేశ్వర్లును ఎంపిక చేశారు.

అట్రాసిటీ కేసును విచారించిన డీఎస్పీ

తర్లుపాడు: ఎంపీడీవోగా పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉన్న చక్రపాణి ప్రసాద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని కార్యాలయంలో తాత్కాలిక స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై గతవారం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత మహిళకు న్యాయం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సంబంధిత కేసుపై దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సోమవారం విచారణ చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని, సాక్షులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట ఎస్ఐ బ్రహ్మనాయుడు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో దినదిన గండం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు


కారుతున్న గది


టేబుల్ పక్కకు జరుపుకొని కూర్చున్న వీఆర్వోలు

స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా జలమయవుతోంది. కార్యాలయంలో పైకప్పులు పెచ్చులూడుతుండటంతో సిబ్బంది భయపడుతూనే విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వీఆర్వోలు కూర్చునే గదిలోని పైకప్పు, గోడలు మొత్తం చెమ్మగా మారిపోయి కారుతుండటంతో వీఆర్వోలు వారి టేబుళ్లను పక్కకు జరుపుకొని పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయం ఎదుట సైతం వర్షపు నీళ్లు నిలిచిపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న కార్యాలయాన్ని తొలగించి నూతన కార్యాలయాన్ని నిర్మించాలని సిబ్బందితో పాటు ప్రజలు కోరుతున్నారు.

– కంభం

సచివాలయ స్థలాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలేవీ..


మీకోసం కార్యక్రమంలో డప్పుకొట్టి నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు


ఎమ్మార్పీఎస్ నాయకులకు మద్దతుగా వచ్చిన స్థానికులు

- అధికారులు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు ఎందుకు నమోదు చేయడం లేదు
- డప్పుకొట్టి నిరసన తెలిపిన ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జయరాజ్

కంభం: కోర్టు పరిధిలో ఉన్న భూమిని చదును చేసిన ప్రైవేటు వ్యక్తులపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో బైఠాయించి డప్పుకొడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ గతంలో సచివాలయం నిర్మాణం కోసం ఎస్సీ పాలెం సమీపంలో అధికారులు శంకుస్థాపన చేసి పిల్లర్లు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ స్థలం తమదంటూ కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో పనులు ఆపేయాలంటూ కోర్టు స్టే ఇచ్చిందన్నారు. సుమారు 5 నెలల క్రితం ఓ ప్రైవేటు వ్యక్తి జేసీబీలతో పిల్లర్లను ధ్వంసం చేసి భూమిని చదును చేశాడని ఈ నేపథ్యంలో తాను పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. వారు పట్టించుకోకపోవడంతో సబ్ కలెక్టర్, కలెక్టర్ లకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారని, పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ కేసు నమోదు చేయలేదన్నారు. కోటి రూపాయల విలువచేసే భూమి అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పేదలకు సెంటు స్థలం ఇవ్వాలంటే భూమిలేదని చెప్పే అధికారులకు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటుంటే చర్యలు తీసుకునే ధైర్యం లేదన్నారు. తహసీల్దార్ పోలీసులకు సమాచారం అందించడంతో ఇద్దరు ఏఎస్సైలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి శాలెంరాజు మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న స్థలంలోని పిల్లర్లు తొలగిస్తుంటే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎస్సీకాలనీ వాసులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ

గిద్దలూరు రూరల్: రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆత్మ పథకంలో భాగంగా మండలంలోని కొంగలవీడు గ్రామంలో సోమవారం రైతులకు ఆధునిక వ్యవసాయం పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక వ్యవసాయంలో అధిక దిగుబడుల కోసం విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడుతున్నారన్నారు. దాని వల్ల భూసారం తగ్గుతూ భౌతిక రసాయన లక్షణాలు దెబ్బతింటాయన్నారు. పంట దిగుబడి పై ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు. నేల ఆరోగ్యం దెబ్బతినడం సూక్ష్మజీవుల నాశనం, భూమి చౌడుబారడం, పెట్టుబడుల పెరుగుదల, పర్యావరణ సమస్యలు తలెత్తుతాయన్నారు. పచ్చిరొట్టలు వేసి దున్నడం, పశువుల ఎరువులు వాడటం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాదిగల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కంభం: మాదిగల శ్మశాన వాటిక స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారని సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కంభం, కందులాపురం లో నివాసం ఉంటున్న మాదిగలు తహసీల్దార్ వీ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. దళితుల శ్మశాన వాటికకు స్థలం లేక పోతే ప్రైవేటు స్థలాన్ని కొని శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

ముగిసిన పట్టాభిరామస్వామి ప్రతిష్ట ఉత్సవాలు


బొడ్డురాయి వద్ద భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతా లక్ష్మణ హనుమత సమేత శ్రీపట్టాభిరామస్వామి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ సోమవారం వైభవంగా ముగిశాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలతో పట్టాభిరామస్వామికి వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ పర్యవేక్షణలో హోమాలు, అర్చనలు, అభిషేకాలు, శిఖర ప్రతిష్ట నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బొడ్డు రాయికి పూజలు నిర్వహించి సీతారాములను దర్శించుకుని పునీతులయ్యారు. పట్టాభిరామస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బంధుమిత్రల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి


కౌన్సిలింగ్ ఇస్తున్న రూరల్ ఎస్సై అంకమరావు

మార్కాపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం పట్టణ శివారులో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న టూవీలర్, ఆటో డ్రైవర్‌లను ఆపి కౌన్సిలింగ్ ఇచ్చి ఫైన్ వేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దని హెచ్చరించారు. ప్రతి బండికి కచ్చితంగా ఇన్సూరెన్స్ ఉండాలని, బండి నడిపే వ్యక్తికి లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని చెప్పారు.

రోడ్డు ఇలా..నడిచేదెలా?


జీజీహెచ్ రోడ్డులో పరిస్థితి ఇలా..

మార్కాపురం: డివిజన్ కేంద్రం మార్కాపురం పట్టంలోని పలు చోట్ల కొద్దిపాటి వర్షానికి రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. సుమారు లక్ష జనాభా ఉన్న పట్టణంలో 35 వార్డులు ఉన్నాయి. వివిధ కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని చెప్పిన నాయకులు రోడ్ల దుస్థితి పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ, ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీ, రాజ్యలక్ష్మి కాలనీ, ఆచార్య కాలనీ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారి నడిచేందుకు వీల్లేకుండా ఉంది. కొద్దిపాటి వర్షం పడినా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి దగ్గర ఉన్న రోడ్డు పూర్తిగా పాడటవంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు వాపోయారు. అలాగే కంభం రోడ్డు, జీజీహెచ్ వైద్యశాల రోడ్లు బురదగా మారాయి. పట్టణంలో పని చేసే ముఖ్యమైన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడే నివాసం ఉంటున్నారు. అయినా రోడ్ల పరిస్థితి పట్టించుకోక పోవడంపై స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షా కాలం కావటంతో కొద్దిపాటి వర్షానికి రోడ్లు అధ్వానంగా ఉంటే ఎవరూ పట్టిచుకోలేదని వమిర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి చేయాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.


కాలనీలో రోడ్డు దుస్థితి


భగత్‌సింగ్ కాలనీలో బురదగా మారిన రోడ్డు

బీసీల్లోని దివ్యాంగులకు అన్యాయం చేయవద్దు


వినతిపత్రం ఇస్తున్న పీఎల్‌పీ యాదవ్, ఇతర నాయకులు

మార్కాపురం: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే మూడు చక్రాల వాహనాల కేటాయింపులో బీసీల్లోని దివ్యాంగులకు అన్యాయం జరగకుండా చూడాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, కార్యవర్గ సభ్యులు ఐ.రంగస్వామి గౌడ్ కోరారు. సోమవారం వారు బీసీ నాయకులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలు ఇస్తున్న విషయం మంచిదేనని, అయితే ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనకబడి ఉన్న బీసీల్లోని పేద వర్గాల దివ్యాంగులు 70 శాతానికి పైగా ఉన్నారని, వాహనాల కేటాయింపులో జనరల్ కేటగిరి కేటాయించిన 77 శాతంలో దివ్యాంగులకు 40 శాతం కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల్లోని దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఆర్. శ్రీనివాసులు, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, చిన్నయ్య, చంచయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


గౌస్‌బాషా (ఫైల్)

పొదిలి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వివరాలు.. గత నెల 24వ తేదీన పొదిలి పట్టణం దర్శి రోడ్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లవరం గ్రామానికి చెందిన వెంకటేష్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వెంకటేష్ బైక్ వస్తుండగా ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వెంకటేష్‌ను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. అప్పటి నుంచి ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి క్షీణించి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మరొకరు కూడా..

పొదిలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. పొదిలి పెద్ద చర్చి వద్ద ఆదివారం రాత్రి మోటారు బైక్, సైకిల్ ఢీకొనడంతో సైకిల్‌పై ఉన్న తూర్పుపాలేనికి చెందిన గౌస్‌బాషా (60) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన్ను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గౌస్‌బాషా మృతి చెందాడు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి


కొనకనమిట్లతో సీపీఐ కళాజాత

కొనకనమిట్ల: ఒంగోలు పట్టణంలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఆ పార్టీ నాయకులు పలు గ్రామాల్లో కళాజాత ద్వారా ప్రచారం చేపట్టారు. మండలంలోని కొనకనమిట్ల, పేరారెడ్డిపల్లి, నాగంపల్లి, మంగాపురం గ్రామాల్లో ప్రచార కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రథమంగా రాష్ట్ర మహసభలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా 23వ తేదీన జరిగే బహిరంగ సభకు అన్నీ గ్రామాల నుంచి ప్రతి సభ్యుడు కుటుంబ సమేతంగా తరలి రావాలని కోరారు. ఆయా గ్రామాల్లో కోలాటం, గేయ నృత్యాలతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో సీపీఐ నాయకులు పీవీ కొండయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, సీహెచ్ పెద సిద్ధయ్య, కళాకారులు అనంతలక్ష్మి, సాయికృష్ణ, డప్పు శ్రీను, ఆయా గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.